క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన రంజిత్‌రావు



శాయంపేట : సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.రంజిత్‌రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ మల్లేష్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో సీఐగా విధులు నిర్వహించిన రంజిత్‌రావును శాయంపేట సర్కిల్‌కు బదిలీ చేశారు. విధుల్లో చేరిన ఆయనకి ఎస్సై దేవేందర్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు

కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడిగా యువరాజు

శాయంపేట : మండలంలోని అప్పయ్యపల్లి గ్రామాధ్యక్షుడిగా పెండెం యువరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బొంతల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి రామారావు, కోశాధికారిగా కుమారస్వామిని ఎన్నుకున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని యువరాజ్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కాజీపేట: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ట్రాఫిక్ సీఐ కె.సుజాత అన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు కాజీపేట పట్టణంలో ఆదివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలు అతిక్రమించడం వల్ల కలిగే ప్రమాదాలు, అనర్థాలను వాహనదారులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై రామారావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మడికొండ ఇన్‌స్పెక్టర్‌గా ప్రతాప్ బాధ్యతల స్వీకరణ

మడికొండ: కాజీపేట సర్కిల్ మడికొండ ఇన్‌స్పెక్టర్‌గా డీ.ప్రతాప్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్సైలు జక్కుల రాజబాబు, దివ్య, పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వేణు బదిలీపై టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నిజామాబాద్‌లో పనిచేసిన ప్రతాప్ మడికొండ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొలిపాక మధు డిమాండ్ చేశారు. హనుమకొండలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులందరిని రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి కొందరినే క్రమబద్ధీకరించి ఒకేషనల్ జూనియర్ కళాశాలల అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ కోదండరామ్ పిలుపు మేరకు ఆనాడు ఉద్యమంలో తాము భాగస్వాములమయ్యామని గుర్తుచేశారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకులందరిని క్రమబద్ధీకరించాలని కోరారు.

సినీహీరో సుమన్‌కు సన్మానం



హన్మకొండ: సినీ కథానాయకుడు సుమన్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ సన్మానించారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని కాంగ్రెస్ నాయకుడు ఈవీ.శ్రీనివాస్‌రావు స్వగృహానికి సుమన్ ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా సుమన్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు, న్యాయవాది యర్రంశెట్టి రాఘవరావు, శ్యామల గణేష్, మహేందర్ గౌడ్, ధనుంజయ గౌడ్, గుండం శ్రీనివాస్, ప్రమోద్, ప్రణీత్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడికి సన్మానం

వరంగల్: అఖిల భారత పద్మశాలి అనుబంధం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కమ్మర్తపు మురళిని వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. హైదరాబాద్‌లోని పద్మశాలి సంఘం భవనంలో మురళిని ఆదివారం కలిసి అభినందించినట్లు రవీందర్ తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి తెలంగాణ రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు పాల్గొన్నారు.

అగ్రంపహాడ్ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- అధికారులతో సమీక్ష సమావేశం
- జాతర పనుల పరిశీలన



ఆత్మకూరు : అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : ఈనెల15వ తేదీలోగా అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో ఆదివారం జాతర పనుల పురోగతిపై సమావేశం నిర్వహించి పనులను పరిశీలించారు. అనంతరం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఒక్కో శాఖలో పనుల పరిస్థితి ఏవిధంగా ఉందని తెలుసుకున్నారు. పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, అలాగే స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కెనాల్ వెంబడి పోల్స్ ఏర్పాటు చేసి రంగులు వేయాలన్నారు. గుడుంబా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు జాతరలో రవాణా కాకుండా పోలీసులు దృష్టి సారించి నిర్మూలించాలన్నారు. ఈవిషయంలో రాజకీయ నాయకులు పైరవీలు చేస్తే సహించేదిలేదన్నారు. జాతరకు భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున బస్సుల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించారు. నాయకులు కూడా సర్వదర్శనంలోనే దర్శనం చేసుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. జాతరలో 100సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈనెల16న జాతరకు మళ్లీ వస్తానని అప్పటి వరకు పనులు పూర్తి కాకపోతే చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. జాతర అభివృద్ధి కోసం మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎంపీపీ మార్క సుమలతరజనీకర్, జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ శేషగిరి, పీఆర్ డీఈ లింగారెడ్డి, ఏఈ లత, విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, సీఐలు రవిరాజు, సంతోష్, ఎస్సై ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, ముద్దం సాంబయ్య, బోరిగం స్వామి, మాజీ సర్పంచ్‌లు మాదాసి రాజు, పర్వతగిరి రాజు , రాంబాబు, ముద్దం కృష్ణ, పరికిరాల వాసు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ మాజీ సర్పంచ్ తుమ్మనపల్లి కిశోర్ ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆయన మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ సర్పంచ్‌గా కిశోర్ చేసిన సేవలు చిరస్మరణీయమని వెల్లడించారు. ఆయనతో పాటు మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కేతిపల్లి సరోజన, కనుకుంట్ల జీవన్‌రావు, కేతిపల్లి శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీ దుబాసి శ్రీలతరాధాకృష్ణ, నాయకులు దామెర శంకర్, కిన్నెర రమేష్, ఆరె సంఘం నాయకులు పేర్వారం లింగమూర్తి, హింగె బాబురావు, రామేశ్వర్, పోతుల కొమ్మాలు తదితరులు ఉన్నారు.



దామెర : కిశోర్ కుటుంబాన్ని ఓదార్చుతున్న ఎమ్మెల్యే

పంటలకు సాగునీరు అందించాలి

- ఎంపీపీ సమ్మిరెడ్డి

వేలేరు : రైతులు పండించే పంటలకు సాగునీరు అందించాలని ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గుండ్లసాగర్ పెద్దచెరువు నుంచి లోక్యతండా చెరువు వరకు దేవాదుల లింక్–2 ద్వారా సుమారు రూ.10 కోట్లు ఖర్చుచేసి పైప్‌లైన్ వేశారని అన్నారు. పైప్‌లైన్ ద్వారా వచ్చే సాగునీటిపై ఆధారపడి వందల ఎకరాల్లో రైతులు వరి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగుచేశారని అన్నారు. గత కొన్ని రోజులుగా అధికారులు పైప్‌లైన్ ద్వారా సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. నీరు విడుదల చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అన్నారు. నాలుగైదు రోజుల్లోగా నీళ్లు ఇవ్వకపోతే రైతులతో కలిసి జిల్లా కలెక్టర్, ఎస్ఈ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేదు

మండలంలోని వివిధ గ్రామాలకు లింక్ రోడ్లు మంజూరు చేయాలని గతంలో మండలానికి వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా రోడ్ల నిర్మాణానికి రూ.12కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం చేపడుతున్న రోడ్ల నిర్మాణంలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ధనార్జనే ధ్యేయంగా రోడ్లు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని మండిపడ్డారు. గతంలో కూడా నిధుల నుంచి మంజూరైన రోడ్లు కొన్నినెలలకే కంకరతేలాయని అన్నారు. జిల్లా కలెక్టర్ రోడ్లను పరిశీలించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఇటీవల పోసిన రోడ్డుపై తేలిన కంకర

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

ఐనవోలు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన నిర్వహించతలపెట్టిన సమ్మె, భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రజాసంఘాల మండల సమావేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దర్శనాల సంపత్ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ మోదీ తన అనునాయులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటించి ప్రజలకు వివరించాలని కోరారు. ఎన్సీడీసీ నుంచి వృత్తిదారులకు రావలసిన నిధులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడంలేదని వాపోయారు. రైతులకు నష్టం చేసే చట్టాలను తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల జిల్లా, మండల నాయకులు గుండెకారి మహేందర్, మడిగె నాగరాజు, శంకర్‌రెడ్డి, రాంకుమార్, యాకయ్య, గోపాల్‌రావు, కుమారస్వామి, ఆనందం, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చక్రపాణి

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ సమీపంలో, నెహ్రూ సెంటర్ ప్రాంతాల్లో ఈనెల 11నుంచి 14వ తేదీ వరకు జరగనున్న గ్రామ దేవతల (బొడ్రాయి) ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మహంకాళి దేవాలయం వద్ద ఉత్సవ కమిటీ కన్వీనర్లు కొల్లూరి యోగానంద్, కేడల జనార్దన్, గుండు పూర్ణచందర్, ఆర్‌వైఎఫ్ యూత్ ఫోర్స్ బాధ్యుల సంయుక్త ఆధ్వర్యంలో వేద పండితులు వెలిదే నరసింహామూర్తి, వెలిదే ప్రభాకర శాస్త్రి, వెలిదే భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రి, భార్గవ శాస్త్రి బృందం నేతృత్వంలో గ్రామ దేవత బొడ్రాయి పూజలు, గణపతి పూజ, గోపూజ, జగద్గురు ఆదిశంకరాచార్యుల పూజ, పుణ్యాహవాచనం , మాతృక పూజ, ఆయుష్య మంత్ర జపం, నాంది, పంచగవ్య ఆరాధన, రక్షాబంధనం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో బొడ్రాయి విగ్రహాల శోభాయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కేడల పద్మ, నాయిని అశోక్, చంద మనోహర్, కొత్త వినయ్, రావుల నరేష్, రాగి శ్రీకాంత్, ఆవునూరి కుమారస్వామి, రావుల సురేష్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో ఉత్సవ కమిటీ సభ్యులు, శివసత్తులు

మల్లికాంబ ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సుధాకర్, శ్రీరామోజు

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో రామమ్ చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. రామమ్ చిట్‌ఫండ్ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో చిట్‌ఫండ్ చైర్మన్ బన్న సుధాకర్, ఎండి శ్రీరామోజు గిరిబాబు, పి.సునీల్, కె.రాజ్‌కుమార్, టి.యాదగిరి, కె.వినోద్, ఎస్.శ్రీనివాస్, ఎస్.రాజశేఖర్, సీహెచ్.శ్రీధర్, ఆర్.రవికుమార్, కె.రమేష్, బి.దీపక్ పాల్గొన్నారు.

కాజీపేటలో మహాన్నదానం



అన్నదానం చేస్తున్న గోశాల నిర్వాహకులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో 400మంది ప్రయాణికులతో పాటు యాచకులకు గౌరి గోశాల నిర్వాహకులు ఆదివారం మహాన్నదానం నిర్వహించారు. గోశాల వ్యవస్థాపకుడు పాశికంటి వీరేశం ఆధ్వర్యంలో దాతల చేయూతతో అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా ప్రతినెలా రెండు రోజులపాటు క్రమం తప్పకుండా గౌరి గోశాల నిర్వాహకులు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో బొల్లికొండ కోటేశ్వర్, శ్రీనివాస్, తేలు సారంగపాణి పాల్గొన్నారు.

'గృహజ్యోతి' పథకానికి వివరాల సేకరణ

శాయంపేట : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా 200 యూనిట్ల ఉచిత కరెంట్ కోసం అర్హులైన వారి నుంచి విద్యుత్‌శాఖ అధికారులు డేటా సేకరిస్తున్నారు. ఆదివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎన్పీడీసీఎల్ ఏఈ రాజ్‌కుమార్, సిబ్బంది అరుణ్‌కుమార్ విద్యుత్ వినియోగదారుల నుంచి ఆధార్, ఆహార భద్రతకార్డు నంబర్, విద్యుత్ సర్వీస్, మొబైల్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు ఫారం నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేశారు. వివరాలన్నింటిని ఈనెల 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



వివరాలను సేకరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

హన్మకొండ: హనుమకొండ స్నేహనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు స్నేహనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ కుసుంబ వెంకట్రాం నర్సింహారావు తెలిపారు. బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ఈనెల 12నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు ఒక ప్రకటనలో వివరించారు. 12న ఉదయం 7గంటలకు నవకల శస్నపనం, 9గంటలకు అంకురార్పణ, దేవతాహ్వానం, కలశస్థాపన అగ్నిప్రతిష్ఠ, మధ్యాహ్నం 3గంటలకు అవధూతేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం 6గంటలకు నిత్యహోమాలు, మంగళ శాసనం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించనున్నట్లు తెలిపారు. 13న ఉదయం 7.30గంటలకు నిత్య హోమాలు, యాగశాల అర్చన, 9.30గంటలకు సుదర్శన హోమం, సాయంత్రం 6గంటలకు యాగశాల అర్చన, నిత్య హోమం, 7.30గంటలకు ఎదుర్కోలు ఉత్సవం ఉంటుందని వివరించారు. 14న ఉదయం 7.30గంటలకు యాగశాల అర్చన, నిత్యహోమం, 9గంటలకు పూర్ణాహుతి కుంభప్రోషణ, 10.30గంటలకు సీతారామచంద్ర స్వామి తిరుకల్యాణ మహోత్సవం, తీర్థప్రసాద గోష్ఠి, మధ్యాహ్నం 1గంటకు తదియారాధన (అన్నదానం), సాయంత్రం 6గంటలకు తిరువిదోత్సవం (పల్లకీ సేవ) జరుపనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

హన్మకొండ: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఎండీ.అబ్దుల్ హై అన్నారు. హనుమకొండ స్నేహనగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్‌లో హనుమకొండ సుబేదారిలోని రామన్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు (ఉత్కర్ష) శనివారం రాత్రి వైభవంగా జరిగాయి. జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్‌హై ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి మాట్లాడారు. పిల్లలకు విలువలను కేవలం మాటల ద్వారానే కాకుండా చేతల ద్వారా ఉపాధ్యాయులు నేర్పించాలని కోరారు. పిల్లలలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తే భవిష్యత్తులో వారు అనేక అవకాశాలను అవలీలుగా అందిపుచ్చుకుంటారని తెలిపారు. చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యర్థులు తల్లిదండ్రులు, గురువులు చూపిన మార్గంలో నడవాలని సూచించారు. టస్మా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎం.రమేష్‌రావు, వడుప్సా జిల్లా అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు బట్టీ విధానాలకు అలవాటుపడకుండా, జ్ఞాపకశక్తితో చదవాలని సూచించారు. రామన్ పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను గత 22 ఏళ్లుగా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఈఓ అబ్దుల్‌హై ప్రశంస పత్రాలు అందించారు. వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ టి.పురుషోత్తం, వైస్ ప్రెసిడెంట్ స్రవంతి, ప్రిన్సిపాళ్లు రజిత, అనుపమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈఓ అబ్దుల్‌హై

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామన్నపేట: నగరంలోని మట్టెవాడ మహబూబియా పంజేతన్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1989 –90వ టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. ఉద్యోగ, వ్యాపార, కుటుంబ వివరాలు, యోగక్షేమాలను పరస్పరం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నసీరుద్దీన్, యూసుఫ్, ప్రసాద్, సర్వర్, ఫజులుర్ రహమాన్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తు బంగారంతో జాతరకు సిద్ధమవుతున్న భక్తులు



కాజీపేటలో ఎత్తుబంగారం తూకం వేసిన భక్తులు

కాజీపేట: మేడారం జాతరకు సమయం దగ్గర పడుతుండడంతో భక్తుల్లో హడావుడి ప్రారంభమైంది. కొద్దిరోజులుగా వేలాది కుటుంబాలు వనదేవతలైన సమ్మక్క –సారలమ్మ తల్లులను కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇళ్లలో సమ్మక్క –సారలమ్మ దేవతలను పూజించి, కొబ్బరికాయలు కొట్టి చుట్టుపక్కల వారికి బంగారం పంచిపెడుతున్నారు. కిరాణం అండ్ జనరల్ స్టోర్లలో ఎత్తు బంగారాలను జోకించి అమ్మవారికి సమర్పించడానికి తీసుకువెళ్తున్నారు. కాజీపేట పట్టణంలో ఉన్న బంగారం (బెల్లం) దుకాణాల్లో భక్తుల రద్దీ ఇటీవలి కాలంలో పెరిగిపోయింది. జాతరకు కొద్దిరోజులే మిగిలిపోవడంతో పోటీపడి ఎత్తు బంగారాన్ని జోకించడంలో భక్తులు నిమగ్నమవుతున్నారు.

పద్మశాలి వివాహ పరిచయ వేదికకు స్పందన



పద్మశాలి పరిచయ వేదికలో నాయకులు

వరంగల్ : తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలి వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. సుమారు 400మంది పద్మశాలి కులస్తులు హాజరైనట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పద్మశాలి యువతీ యువకులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎనిదేళ్లుగా సేవా దృక్పథంతో పద్మశాలి మ్యారేజ్ బ్యూరోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిచయ వేదికలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ అధ్యక్షతన జరిగిన పరిచయ వేదికలో సంఘం మ్యారేజ్ బ్యూరో రాష్ట్ర కన్వీనర్ లకుం నవీన్, రాజ్‌కుమార్, పిట్ట ఉమాదేవి, ఆడెపు నాగరాజు, బూర తిరుపతయ్య, బింగి సురేష్, గొట్టిముక్కల నాగసాగర్, రాజమౌళి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వాసవీమాతను దర్శించుకుంటున్న ఆర్యవైశ్యులు



హన్మకొండ: కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ఖిలా వరంగల్: వాసవీమాత అమ్మవారి ఆత్మార్పన దినోత్సవం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని ఆర్యవైశ్య సంఘం భవనంలో సంఘ అధ్యక్షుడు మంచాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వాసవిమాతకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటానికి ఆర్యవైశ్యలు భక్తిశ్రద్ధలతో పూలమాలలు వేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులకు సంఘం ప్రతినిధులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అంచూరి కిషోర్, శ్రీమన్నారాయణ, కూరగాయల శ్రీనివాస్, వెంకన్న, రావికంటి అశోక్, తోట ప్రసాద్, ఓరగంటి విమల, శ్రీదేవి, మంచాల రాణి, తోట శ్రీలత, త్రివేణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

హన్మకొండ: దైనందిన కార్యక్రమాలతో పాటు ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని, దేవతారాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు తెలిపారు. వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హసన్‌పర్తిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్లబ్ అధ్యక్షుడు మంచెన శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం కుంకుమ పూజలు చేశారు. క్లబ్ ప్రతినిధులు కరంచంద్, అప్పని శంకర్, నాగమల్ల సుధీర్, సంద్రు నాగేందర్, చిదర భానుప్రకాశ్, చకిలం సులోచన, నిరోషా, సునీత, పద్మ, ఊర్మిళ పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీలోని ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను ప్రముఖ సంగీత విద్వాంసులు కేవీ.బ్రహ్మానందం ఆదివారం ప్రారంభించారు. ముందుగా త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నీరాజనం అర్పించారు. నాదసుధా తరంగిణి సంగీత శిక్షణాలయ విద్యార్థులు సుమారు 12గంటల పాటు నిర్వహించిన సంగీత విభావరి సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో తరంగిణి సంగీత శిక్షణాలయ నిర్వాహకురాలు బి.విజయలక్ష్మి, బి.శేషగిరి, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.